

# ప్రమాదం జాగ్రత్త!

## - కొమ్మూరి సాంబశివరావు



*(గత సంచిక తరువాయి)*

**వింగ్ కమాండర్** ముఖర్జీ ఆ రోజంతా ఆస్పత్రిలో పిల్లల పక్కనే కూర్చున్నాడు. నిద్రమందువల్ల, దీర్ఘనిద్రలో వున్న పిల్లల్ని చూస్తూ కూర్చున్నాడు. సాయంకాలం ఆరుగంటలకి నారాయణస్వామి వచ్చాడు ఆస్పత్రికి.

"సారీ, షీలాగారి గురించి ఏమీ తెలియలేదు" అన్నాడు. ముఖర్జీ మాట్లాడలేదు.

"ఏదో ఆలోచిస్తున్నారు, ఏమిటి?"

"ఇప్పుడు చెప్పే ఆలోచనలు కావు" అన్నాడు ముఖర్జీ.

"మీకు అభ్యంతరం లేకపోతే, మీకు తోడు -"

"నిన్న రాత్రంతా యింటికి వెళ్ళకుండా నాతో వుండిపోయారు. ఇంటికి వెళ్ళండి. ఏమైనా కబురు తెలిస్తే ఫోన్ చేస్తాను" అన్నాడు ముఖర్జీ.

పిల్లలు రాత్రంతా నిద్రలో కలవరిస్తూనే ఉన్నారు. "అమ్మా, అమ్మా!" అని. అంతకన్నా ఏం అనరు. వేరే ఏమైనా మాట నోటివెంట వస్తుందేమోనని కన్ను మూయకుండా మెలుకువగా కూర్చున్నాడు వింగ్ కమాండర్ ముఖర్జీ.

రాత్రి రెండుగంటలకి నైట్ డ్యూటీ నర్స్ వచ్చి "మీకు టెలిఫోన్ కాల్" అన్నది.

ముఖర్జీ గుండె ఒక పక్క దడదడమంటున్నది. మరొకపక్క షీలా ఫోన్ చేసిందేమోనని గంటలు మోగుతోంది.

"హల్లో వింగ్ కమాండర్ ముఖర్జీ హియర్."

"అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్, క్రయిమ్స్ హియర్, ఒకసారి మీరు వెంటనే మా ఆఫీసుకు రాగలరా! మీకు కారున్నదా! మా కారు పంపించనా?"

"ఏమిటి విషయం?"

"మీతో మాట్లాడాలి. ప్లీజ్, ఒకసారి రావాలి."

"సరే నేనే వస్తాను." పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోమని చెప్పి, బయలుదేరబోతూ జ్ఞాపకం వచ్చి, నారాయణస్వామికి ఫోన్ చేసి చెప్పాడు.

"కమాండర్ మీరు డ్రయివ్ చెయ్యకండి. నేను వస్తాను. దగ్గరే. పది నిమిషాల్లో వస్తాను, కలిసి వెళదాం" అన్నాడు నారాయణస్వామి.

❖❖❖

"కూర్చోండి యస్, ముఖర్జీగారితో పరిచయం లేదుకాని, మిమ్మల్ని చాలాసార్లు చూశాను" అన్నాడు ఎ.సి.నారాయణస్వామితో.

"ఎందుకు రమ్మన్నారు అడిగాడు ముఖర్జీ.

"ఇంకా ఏమీ నిశ్చయం కాలేదు, కాని.."

"కమాన్ యిఫ్ ఇట్ ఈజ్ బాడ్ న్యూస్, క్విక్ టెల్ ఇట్" అరిచాడు ముఖర్జీ.

"బాడ్ న్యూస్ అని అప్పుడే చెప్పలేను. మీ పిల్లలు ఇద్దరూ నిన్నరాత్రి కనిపించిన ప్రదేశానికి, మరో ఇరవై మైళ్ళ దూరంలో రోడ్‌కి, ఒక అరఫర్లాంగు దూరంలో పొదల మధ్య ఒక స్త్రీ శవం కనిపించింది అని రిపోర్ట్ వచ్చింది. ఎండు కర్రలు ఏరుకునేందుకు వెళ్ళిన పల్లె ముసలి, స్త్రీ శవాన్ని చూసింది. పోలీసులకి కబురు అందగానే వెళ్ళారు. శవాన్ని కదల్చలేదు. ఎవరూ ఆ ప్రాంతాలకి రాకుండా కట్టుదిట్టాలు చేశారు. సూచనలు చెదిరిపోతాయేమోనని, ఆ స్త్రీ బట్టలనిబట్టి, పల్లెప్రాంతాల స్త్రీకాదనీ, నగరవాసనీ, అక్కడి పోలీసులు నిర్ణయించారు. వయస్సు పాతిక ముప్పయి మధ్య. మనం వెళ్ళిచూసి.."

ముఖర్జీ మొహం ఒక్కసారిగా రక్తం లేకుండా, రంగులేకుండా, కండలు కరిగిపోయినట్టు పీక్కుపోయింది.

"కమాండర్, అప్పుడే షీలా కాదని ఆశిద్దాం. రండి" అన్నాడు నారాయణస్వామి, ముఖర్జీ భుజం మీద చెయ్యివేస్తూ.

ముందు పోలీస్ వాన్‌లో, ఎ.సి, ముఖర్జీ, నారాయణస్వామి, డాక్టరు వెనక వాన్‌లో ఫోటోగ్రాఫర్లు, వేలిముద్రల నిపుణులు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, క్రయిం బ్రాంచి కానిస్టేబుల్స్, ఇద్దరు సార్జంట్సు.

రెండు కార్లు వేగంగా వెళుతున్నాయి. ముందు కారులో ఎవరూ ఏమీ మాట్లాడలేదు. శవాన్ని చూసేటంతవరకూ అందరూ ఊపిరి బిగపట్టుకున్నట్టు కూర్చున్నారు. ముఖర్జీ సిగరెట్ తర్వాత సిగరెట్ వరసగా తాగుతున్నాడు.

దూరంగా రెండు పోలీస్ వాన్‌లు ఆగి ఉండడం చూశారు, "అదే స్థలం డ్రయివర్ స్లోడవున్. అక్కడ ఆపు" అన్నాడు ఎ.సి.

వాన్ ఆగగానే సూపరింటెండెంట్ సెల్యూట్ చేసి "మీరు మీ బలగాన్ని తెస్తారనే నేను ఏమీ చెయ్యలేదు" అన్నాడు.

"వెరీగుడ్"

"శవాన్ని చూసిన ఆ ముసలి స్త్రీని పోలీస్ వాన్‌లో కూర్చోపెట్టాము."

"దట్ ఈజ్ గుడ్"

రోడ్ మీద దాదాపు యాభయి మంది జనం పోగయ్యారు. ట్రంక్ రోడ్ పక్కగా, గుబురుగా పెరిగి వున్న పొదల మధ్యనించి తీసుకుని వెళుతున్నాడు ఆ పోలీసు ఉద్యోగి.

"ఇక్కడ అడుగుజాడలు" ఎ.సి - అడుగుతున్నారు. "లేవు. లేవని నిశ్చయించిన తర్వాతే, మిమ్మల్ని ఇటు నించి తీసుకెళ్ళాలని నిర్ణయించుకున్నాను."

గుబురుగా దట్టంగా పెరిగివున్న పొదలు చటుక్కున ఎవరో, యికవద్దు అని ఆజ్ఞాపించినట్టు ఆగిపోయాయి. ఒక పదిగజాల విస్తీర్ణం వరకూ గడ్డి తప్ప ఏమీలేదు. ఆ గడ్డిమీద పడి వుంది. వొంటిమీద బట్టలేదు, వెల్లకిలా పడుంది. మొహం స్పష్టంగా కనిపిస్తోంది.

అంతే, ఆ దృశ్యం చూశాడో లేదో 'షీలా!' అని ఒక్క పొలికేక పెట్టాడు. నారాయణస్వామి ముఖర్జీని గట్టిగా పట్టుకున్నాడు. ఆజానుబాహుడయిన ముఖర్జీ, గజగజ వణికిపోతున్నాడు. ఏడుస్తున్నాడో, లేక అతనికి మెదడు చెడిందో తెలియనట్టు కళ్ళప్పగించి చూస్తున్నాడు.

"కమాండర్, మీరు సామాన్యమైన పౌరుడు కారు. డిఫెన్స్ ఫోర్స్ మనిషి. మృత్యువు, అకాల మృత్యువు, భయంకర చావు వీటికి తట్టుకునే శక్తి మీకుండాలి. దయచేసి తమాయించుకోండి" అన్నాడు. ఎ.సి.

ముఖర్జీ మాట్లాడలేదు.

"దూరాన్నించి చూసి, మీ భార్యేనని మీరు నిర్ణయించడం మీకూ , ఆమెకీ న్యాయం కాదు. బాధ తప్పదు, దగ్గరికి వెళ్ళి ఆమె."

"నో! నేను ఫామిలీ ఫ్రెండ్‌ని. ఆమె షీలాగారే! కారో నేను గుర్తుపట్టగలను. కమాండర్‌ని యిక పీడించకండి" అన్నాడు నారాయణస్వామి.

"ఆల్‌రైట్. ఐ వాంట్ ఏ సర్టన్ ఐడెంటిఫికేషన్."

"యు కెన్ హావ్ యిట్" అని సార్జంటుని చూసి, "కమాండర్‌ని కారు దగ్గరికి తీసికెళ్ళండి" అని చెప్పాడు నారాయణస్వామి.

రాత్రి తొమ్మిది గంటలు. పిల్లలు యిద్దరూ నిద్రపోతున్నారు. సాయంకాలమే ఆసుపత్రినించి యింటికి తీసుకొచ్చేశాడు ముఖర్జీ. అమ్మాయి యేమీ చెప్పలేక పోయింది.

రంజన్ చెప్పాడు. ఒకటికి రెండుసార్లు, మధ్య మధ్య ప్రశ్నలు వేస్తూ చెప్పించాడు. అదంతా విపులంగా, ఏ ఒక్క వివరమూ, విడిచిపెట్టకుండా కాయితం మీద వ్రాశాడు. పిల్లలు నిద్రపోయారు. నౌకరు తనకి భోజనం తెచ్చి యిస్తే వెనక్కి తీసుకుని వెళ్ళమని, విస్కీ సీసాతో కూర్చున్నాడు. టి.వి బల్లపక్కనున్న ఫోటోవైపే చూస్తున్నాడు. క్రితం రాత్రి ఆలోచనలు వేరు, యీ రాత్రి ఆలోచనలు వేరు. ఏడవాలంటే కళ్ళ వెంట నీళ్ళు కూడా రానంత, గుండె రాయి అయిపోయినంత, మనస్సు మొద్దుబారినంత దుఃఖం. ఎంత అందమైనది. ఆమె అందం ఆమెకి శత్రువు అయిందా.

"సోడా!" కేకేశాడు.

నౌఖరు సోడాసీసా తెచ్చిపెట్టాడు. మళ్ళీ యింకో గ్లాసు నింపుతున్నాడు ముఖర్జీ. తలుపు చప్పుడయింది. నౌఖరు వెళ్ళి తలుపు తీశాడు. దడదడ చప్పుడు, టకటక బూట్సులు.

ఏ.సి, క్రయిం బ్రాంచి ఇన్‌స్పెక్టర్. నారాయణస్వామి ముగ్గురూ లోపలికి వచ్చారు.

"ఆస్పత్రికి వెళ్ళాం. పిల్లల్ని యింటికి తీసుకుని వెళ్ళారని చెప్పారు." ముఖర్జీ తల వూపాడు.

"పిల్లలు ఏం చెప్పారు?" అడిగాడు ఏ.సి.

ముఖర్జీ తను వ్రాసిన కాయితం నారాయణస్వామికి యిచ్చాడు.

రంజన్ చెప్పిన విషయంలో సారాంశం -

ఇంటికి దగ్గర్లో, అంటే ఒక అరమైలు దూరంలో వున్న సినిమాకి వెళ్ళారట. సినిమాకి వెళ్ళాలనే ఆలోచన షీలాకి వచ్చిందట. ఆ సినిమా అది ఆఖరి రోజు. ఇంటర్వెల్‌లో పిల్లలకి ఐస్‌క్రీమ్ కొనివ్వడానికి, యిద్దరు పిల్లల్ని తీసుకుని, షీలా వసారాలోకి వచ్చి, పిల్లలకి ఐస్‌క్రీమ్ కొన్నది. పిల్లలు ఐస్‌క్రీమ్ తింటున్నారు. అప్పుడు ఒకతను తెల్లగా వున్నాడు. కాకీరంగు డ్రస్, పోలీసు ఉద్యోగిలా ఉన్నాడు. షీలా దగ్గరికి వచ్చి, "మిసెస్ ముఖర్జీ తమరేనా?" అడిగాడట.

"యస్."

"సారీ, మీ భర్త వింగ్ కమాండర్ ముఖర్జీగారు, టెస్టు ఫ్లయిట్ మీద వెళుతుండగా ప్రమాదం జరిగింది."

షీలా కూలిపోతోంది. "నో! ఆయనకి ప్రమాదం ఏమి లేదు. గాయపడ్డాడు, అంతే -"

షీలా తేరుకున్నది.

"ఏర్‌ఫోర్స్ హాస్పిటల్లో చేర్పించారు. వెంటనే మిమ్మల్ని, పిల్లల్ని తీసుకురమ్మని కబురు పంపారు."

షీలా పిల్లలతో అతనివెంట వెళ్ళింది. నల్లని అంబాసిడర్ కారు ఎక్కారు షీలా, పిల్లలూ. ముందు సీటులో డ్రయివర్ యింకొక మనిషి వున్నారు. కారు బయలుదేరింది. వెనక సీటులో కూర్చున్న అతను షీలా మొహం మీద జేబురుమాల పెట్టాడు. షీలా గిలగిలలాడింది. పిల్లలు అరవబోతే ముందు సీటులో వున్నతను వెనక్కి వచ్చి యిద్దర్నీ నోరు నొక్కిపట్టుకున్నాడు.

కారు జోరుగా వెళ్ళిపోయింది. పిల్లల్ని యిద్దర్నీ కారులో, కాళ్ళు పెట్టుకునేచోట, లేవకుండా వాళ్ళ వీపుమీద నొక్కిపెట్టారు వాళ్ళిద్దరూ.

తర్వాత ఎంత సేపటికో, ఏ రాత్రివేళో కారు ఒక చోట ఆగింది. పిల్లల వీపు మీద నించి కాళ్ళు తీసేసి "దిగండి!" అన్నాడు ఒకడు.

"అమ్మా, అమ్మ రానిదే దిగము" అన్నాడు ధైర్యంగా రంజన్.

"చిటికిన వేలంత లేడు, వీడికి" అంటూ ఆ రెండో అతను రంజన్‌ని బూట్సు కాలితో ఒక తన్ను తన్నాడు. కారులోంచి వెళ్ళి రోడ్ మీద పడ్డాడు. "అమ్మా!" అంటున్నాడు. అంతలో తనలా సంధ్యని కూడా ఒక్క తన్ను తన్ని కారులోంచి బయట పారేశారు. తర్వాత కారు కదిలిపోయింది. అక్కడే ఏడుస్తూ కూర్చున్నారు, రాంసింగ్ వచ్చేటంత వరకూ.

నారాయణస్వామి, ఏ.సి, ఇన్‌స్పెక్టర్ ముగ్గురూ చదివారు.

"రంజన్, వారిలో ఎవర్నయినా గుర్తుపట్టగలడా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్. ముఖర్జీ గుర్తుపట్టలేడన్నట్లు తల విదిలించాడు.

"ఆరేళ్ళయినా లేవు, పైగా కాకీ బట్టలు, టోపీ పెట్టుకున్న వాళ్ళంతా వాళ్ళకి ఒకే రకంగా కనిపిస్తారు. మీసాలున్నాయా? లేవా? అంటే కూడా చెప్పలేకుండా వున్నాడు" అన్నాడు ముఖర్జీ ఇంకో గుక్క విస్కీ తాగుతూ.

"పొదల వెనక కన్పించిన శవం మీ భార్య షీలా గారిదే" అన్నాడు ఎ.సి.

ముఖర్జీ మాట్లాడలేదు, అవసరం లేనట్లు.

"ఆమె ఏ విధంగా, ఎందుకు హత్య చెయ్యబడిందీ, వివరాలు చెప్పమంటారా లేక యింక్వెస్టు అప్పుడు -"

"దయచేసి చెప్పండి" అన్నాడు ముఖర్జీ.

అది అత్యవసరమైన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం. ఆ సమావేశానికి డిఫెన్స్ సెక్రటరీ, అండర్ సెక్రటరీ, సి.బి.ఐ. డైరెక్టరు, స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ బండార్కర్, ఐ.జి. ఆఫ్ పోలీస్ బొంబాయి హాజరయ్యారు. కాబినెట్ మీటింగుకి మినిట్స్ వ్రాయవద్దని ముందే ఆదేశం యివ్వడం వల్ల గదిలో మరెవ్వరూ లేరు.

అండర్ సెక్రటరీ నారాయణస్వామి గొంతు సవరించుకుని, "వింగ్ కమాండర్ ముఖర్జీగారి సహకారం వుంది. ఆయన చెప్పరు" అన్నాడు.

"వెరీగుడ్, కాని."

"అవును. మిసెస్ ముఖర్జీని మానభంగం చేసి, హత్య చేసిన హంతకుణ్ణో, హంతుకలనో పట్టుకోనిదే ప్రజలు వూరుకోరు."

"శాంతి భద్రతల మీద నమ్మకం పోతుంది" అన్నారు హోం మంత్రి.

"పాలసీ మీరు నిర్ణయించారు కనుక మిగతా వివరాలు మాకు, సి.బి.ఐకి వదిలిపెట్టండి" అన్నాడు సి.ఐ.బి డైరెక్టర్.

"అంటే?" అడిగాడు హోం డిపార్టుమెంట్ సెక్రటరీ.

"శ్రీమతి షీలా ముఖర్జీని హత్య చేసిన వార్ని పట్టుకుని ఉరికంబం ఎక్కించడం మా వంతు."

అందరూ ప్రధానివైపు చూశారు. "అలా చెయ్యడం నాకు యిష్టంలేదు. నా అంతఃకరణ అంగీకరించడం లేదు."

"ఎవరికీ యిష్టంలేదు కాని, తప్పదు అనుకుంటాను" అన్నాడు డిఫెన్సు మంత్రి.

ప్రధాని తల ఊపాడు. సమావేశం పూర్తి అయింది.

## 6

"వింగ్ కమాండర్ షీలా ముఖర్జీ హత్య" హత్యకి సంబంధించిన వివరాలతో పత్రికల్లో వార్తలు పడ్డాయి. నగరంలో స్త్రీలకీ, పిల్లలకీ, ఆఖరికి పురుషులకి కూడా భద్రత అనేది లేకుండా పోయిందనీ, హంతకులు, బందిపోటు దొంగలు రాజ్యం ఏలుతున్నారనీ, పోలీసువారు తమ బాధ్యతలని సక్రమంగా నిర్వహించడం లేదనీ, పత్రికలు సంపాదకీయాలు వ్రాశాయి. పాఠకులు వుత్తరాల మీద ఉత్తరాలు వ్రాస్తున్నారు పత్రికలికి. ప్రతిపక్షాలవారు, ముఖ్యనగరాలలో సభలు జరిపి, ముఖర్జీగారికి సానుభూతి తెలియజేస్తూ, ప్రభుత్వం మీద దుమ్మెత్తి పోస్తున్నారు.

"షీలా ముఖర్జీ హత్యకేసులో కొన్ని సూచనలు. షీలా ముఖర్జీని, ఆమె పిల్లల్నీ సినిమా థియేటర్లోంచి తీసుకెళ్ళిన అంబాసిడర్ కారు నెంబర్, థియేటర్ పార్కింగ్ మనిషి చెప్పగలిగాడు. పూనా ప్రాంతాల్లో ఒక పెట్రోలు బంక్‌లో పోసుకునేందుకు ఒక నల్ల అంబాసిడర్ కారు ఆగింది. పెట్రోలు బంక్ వాళ్ళు బిల్లులో నెంబర్ వ్రాశారు. కనుక అదే కారని తేలింది. కాని ఆ కారు స్వంతదారునికీ, ఈ హత్యకీ సంబంధం లేదనీ నిశ్చయమైంది. క్రితంరోజు ఆ కారుని, తన యింటిముందు నుంచి యెవరో యెత్తుకుపోయారని, ఆ కారు స్వంతదారుడు పోలీస్ కంప్లయింట్ యిచ్చాడు. నెంబర్ ప్లేటు మార్చాడు హంతకుడు. ఈ సూచనని బట్టి హంతకుణ్ణి పట్టుకోవచ్చని పోలీసులు భావిస్తున్నారు."

మరి రెండు రోజులు తర్వాత యింకో ప్రకటన.

"షీలా ముఖర్జీని ఎత్తుకుపోయిన నల్ల అంబాసిడర్ కారు పూనాలో ఒక మారుమూల వీధిలో కనపడింది. గత నాలుగు రోజులుగా ఆ కారు అక్కడే వుండడం వల్ల, పోలీసులకి కంప్లయింట్ యివ్వగా పోలీసులు వెళ్ళి చూశారు. నెంబర్ని పట్టి, అదే హంతకుడు ఉపయోగించిన కారు అని తేలింది. వేలిముద్రలు నిపుణులు, సైంటిస్టులు పరీక్ష చెయ్యడానికి ఆ కారుని, పోలీసులు హెడ్‌క్వార్టర్స్‌కి తీసుకుని వెళ్ళారు. ఆ కారులో యెవరు వచ్చి అక్కడ వొదిలి పెట్టినదీ తెలియలేదు కాని, ఆ కారులోంచి దిగి వెళ్ళిపోతున్న మనిషిని స్పష్టంగా చూశాననీ, గుర్తుపట్టగలననీ, ఆ వీధిలో వున్న ఒక పెద్దమనిషి చెప్పారు."

కొన్ని రోజుల తర్వాత పత్రికల్లో:

షీలా ముఖర్జీ హత్యకేసు. మరికొన్ని సూచనలు.

"పూనాలో కనపడ్డ, హంతకుడు ఉపయోగించిన అంబాసిడర్ కారుని, నిపుణులు క్షుణ్ణంగా పరీక్ష చేశారు. స్టీరింగ్ వీల్ మీద, తలుపుల హాండిల్స్ మీద స్పష్టంగా వేలిముద్రలున్నాయి. అంతేకాక, కారు వెనుక సీటు మీద రక్తం మరకలు, ఒక జేబురుమాలు కనిపించాయి. రక్తపు మరకలు పరీక్ష చెయ్యగా, ఓ గ్రూపు మరకలని తేలింది. షీలా ముఖర్జీ పిల్లలు ఇద్దరి రక్తం ఓ గ్రూపే. ఆ జేబురుమాల, వేలిముద్రల ఆధారంగా హంతకుణ్ణి పట్టుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి."

మరొక రెండురోజుల తర్వాత పత్రికల్లో.

"షీలా ముఖర్జీ హత్యకేసు. హంతకుడు యెవరో తెలిసిపోయాడు, సి.బి.ఐ డైరెక్టర్ యీ రోజు పత్రికా ప్రతినిధుల్ని సమావేశపరిచి, షీలాముఖర్జీ హత్య కేసు వివరాలు చెప్పి, నిదర్శనాలు పత్రికా విలేఖరులకి చూపించారు. కారు స్టీరింగ్ వీలుమీద, హాండిల్స్ మీద వున్న వేలిముద్రలు, దొంగతనాలు దోపిడీలు, మానభంగాలు దేశంలో పలుచోట్ల చేసిన ఒక పాత నేరస్థుడు శిఖామణికి చెందినవని తేలిందని చెప్పారు. గత ఆరేళ్ళుగా శిఖామణి అనే అతను మద్రాసు, బొంబాయి, కలకత్తా, ఢిల్లీ, అహమ్మదాబాద్, బెంగుళూరు, పాట్నా నగరాలలో రకరకాల నేరాలు చేశాడనీ, పోలీసులు అతని కోసం యిన్నేళ్ళుగా గాలిస్తున్నారనీ, దొరక్కుండా

వున్నాడనీ, శిఖామణి హత్యచెయ్యడం తమకి తెలిసినంతవరకూ యిది మొదటిది అనీ, సి.బి.ఐ డైరెక్టర్ చెప్పారు. రెండుసార్లు శిఖామణిని పట్టుకున్నామని, రెండుసార్లు శిఖామణి పోలీస్ లాకప్‌లోంచి తప్పించుకున్నాడనీ కూడా చెప్పారు. పోలీస్ లాకప్‌లో వుండగా శిఖామణి ఫోటో పోలీసులు ఐడెంటిఫికేషన్ కోసం తీయించారు. ఆ ఫోటో సి.బి.ఐ డైరెక్టరు పత్రికా ప్రతినిధులకి, ఒక్కొక్క కాపీ యిచ్చి పత్రికల్లో ప్రకటించమన్నారు. శిఖామణిని పట్టి యిచ్చినవారికి, లేక శిఖామణి వునికి తెలిపినవారికి, ప్రభుత్వం పదివేల రుపాయలు బహుమానం యిస్తుందనీ ప్రకటించారు. శిఖామణికి హిందీ, తమిళం, కన్నడం, మరాఠీ, బెంగాలీ, వురుదూ, యింగ్లీషు భాషలు బాగా వచ్చుననీ, ఆరు అడుగుల పొడుగు, సన్నం. గోధుమరంగు వొళ్ళు, సన్నని మీసాలు, కుడికన్ను కింద గురిగింజంత నల్లని మచ్చ. వేషం క్షణంలో మార్చుకోవడంలో శిఖామణి నిపుణుడు. అంతేకాక, ఎప్పుడూ దగ్గర బాకు, పిస్తోలు ఉంటాయుట. అతన్ని పట్టుకో ప్రయత్నించేవారు జాగ్రత్తగా వుండవలసిందని హెచ్చరించారు" ఈ వార్త తర్వాత శిఖామణి ఫోటో ముద్రించి "పదివేలు బహుమానం" అని వ్రాశారు పత్రికలవాళ్ళు.

మరికొన్ని రోజుల తర్వాత పత్రికల్లో:

"శిఖామణి కోసం దేశంలోని పోలీసు బలగం అంతా గాలిస్తున్నా ప్రజలు వెయ్యికళ్ళతో కనిపెడుతున్నా అతని ఆచూకీ యింకా తెలియకుండా వుంది. హత్య జరిగిన నెలరోజులు దాటినా అతను దొరక్కపోవడంవల్ల, శిఖామణి దేశం వొదిలి పారిపోయాడేమోనని అనుమానం కలుగుతోంది. కానీ, దేశాన్నించి పారిపోయి వుండడానికి వీలులేదనీ, పోలీసులు వెయ్యికళ్ళతో కనిపెట్టి ఉన్నారనీ, దేశంలోనే యే మారుమూలో, మారువేషంలో వుండి ఉంటాడనీ చెపుతూ, బహుమానం యాభయివేల రూపాయలకి హెచ్చించారు ప్రభుత్వం. ఈ బహుమానం పోలీసు అధికారులకి కూడా యిస్తారట. ఇక ప్రతి పోలీసు కానిస్టేబుల్ శిఖామణి కోసం వెతుకుతూ ఉంటాడు. శిఖామణి త్వరలో దొరుకుతాడనీ దృఢ విశ్వాసం వెలిబుచ్చారు సి.బి.ఐ డైరక్టర్."

వారం రోజుల తర్వాత పత్రికల్లో:

"హంతకుడు శిఖామణి అరెస్టు."

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Post your comments